క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని సవాతి గ్రామానికి చెందిన గర్భిణీ వి.అంబుబాయి సోమవారం రాత్రి 108 వాహనంలో మగ శిశువుకు జన్మనిచ్చింది. ఈఎస్టీ రజిజీకాంత్, పైలట్ భీం రావులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి అంబుబాయిని సవాతి నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో పురిటినొప్పులు ఎక్కువ కాగా మార్గమధ్యలో అంబులెన్స్ వాహనంలోనే ప్రసవం చేసినట్లు తెలిపారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



కొత్తగూడ ప్రధాన రహదారిలోని గుంతను మొరంతో పూడుస్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండలంలోని ఎల్కపల్లి, కొత్తగూడ గ్రామాల్లో మంగళవారం పర్యటించి మురుగునీరు నిల్వ ఉండకుండా గుంతల్లో మొరం వేయించారు. ఆయన వెంట ఎంపీవో గంగాసింగ్, మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్రయ్య యువకులు ఉన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

ఎంపీడీవో రమేశ్‌ను మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. పెద్దపల్లి జిల్లా నుంచి పెంచికల్‌పేట్ ఎంపీడీవోగా బదిలీపై రాగా శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.

బహిరంగ సభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న శ్రీనివాస్

దహెగాం: ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఈనెల 11న కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, మండల కో కన్వీనర్ వజ్రమ్మ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జయప్రద, ఆశావర్కర్ మండల యూనియన్ అధ్యక్షురాలు శోభ, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా 'సఖీ'



సఖీ సేవలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

దహెగాం: మహిళలకు అండగా 'సఖీ' ఉంటుందని సఖీ బృందం సభ్యులు అన్నారు. మంగళవారం మండలంలోని రాంపూర్, దిగిడ, మొట్లగూడ, కర్జి, గిరవెల్లి గ్రామాల్లోని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖీ ఆధ్వర్యంలో మహిళలకు శారీరక, మానసిక గాయాలైన వారికి తక్షణ వైద్య సేవలతో పాటు రక్షణ సహాయం అందిస్తుందన్నారు. సఖీ ఆధ్వర్యంలో అందించే సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖీ సిబ్బంది సత్యశీల, పవిత్ర, రఘు, ఆయా గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయం జాతర వేలం

కాగజ్‌నగర్‌రూరల్: మహాశివరాత్రి పురస్కరించుకొని మంగళవారం ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో వేలం నిర్వహించారు. టెంకాయలు, ప్రసాదం, తైబజార్ నిర్వహణ, పాలు, పత్రి, కొబ్బరి ముక్కలు పోగు చేసుకోవడం, వాహనాల పార్కింగ్ కోసం వేలం నిర్వహించారు. మొత్తంగా రూ. 19లక్షల8వేలకు వేలం దక్కించుకున్నారు. వేలంలో 24 మంది పాల్గొన్నారు. గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్వహణ అధికారి బాపురెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతర

కెరమెరి: పోతురాజు ధర్మరాజు ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. మండలంలోని ఇందాపూర్ గ్రామ సమీపంలో ఉన్న పోతురాజు ఆలయానికి మంగళవారం భక్తజనం పోటెత్తింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాలతో పాటు సమీప మహారాష్ట్ర నుంచి కొలాం తెగకు చెందిన భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



దేవతలకు పూజలు చేస్తున్న భక్తులు



పితృదేవతలకు మొక్కుతున్న భక్తులు



దేవతామూర్తులకు కటోడాల పూజలు



సంప్రదాయ నృత్యం చేస్తున్న భక్తులు

'పార్లమెంట్ ఎన్నికల్లో ఆశీర్వదించండి'

దహెగాం: బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు సేవ చేయడానికి రాజకీయల్లోకి వస్తున్నట్లు ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగుణక్క అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో పర్యటించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేస్తానన్నారు. సీఎంపై బీఆర్ఎస్ నాయకుడు బాల్కసుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోగయ్య, నాయకులు వెంకటేశ్, శ్రీనివాస్, రవి, రాజు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రజలు ఆశీర్వదిస్తే ఆదివాసీ, గిరిజన, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని ఆదివాసీ సంఘం మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ అన్నారు. పెంచికల్‌పేట్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా మానవ హక్కుల కోసం పోరాటం చేస్తున్నానన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తే తనపై 56 కేసులు పెట్టారని పేర్కొన్నారు. గోండ్వాన ఆదివాసీ కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్, ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకుడు సోయం చిన్నయ్య, భిక్షపతి, ఘణపురం బాపూజీ, శ్రీనివాస్ ఉన్నారు.



పెంచికల్‌పేట్‌లో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న సత్యనారాయణ గౌడ్

కాగజ్‌నగర్‌రూరల్: పరిశుభ్రతే లక్ష్యంగా పని చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని అనుకోడ, గన్నారం, రాంనగర్, భట్‌పల్లి, ఎన్‌జీఓఎస్ కాలనీల్లో పర్యటించారు. నర్సరీలు, ఈజీఎస్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయా పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

కౌటాల: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నాస్కం ఫౌండేషన్ శిక్షకులు సునీత అన్నారు. మంగళవారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై నాస్కం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఆటలు ఆడి నష్టపోవద్దన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. భయం వీడి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం హన్మంతు, సీఆర్పీలు ప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జాతరపై సర్వహక్కులు అరటిపల్లి గ్రామస్తులవే'



సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద గ్రామస్తులు

తిర్యాణి: మండలంలోని చిన్న అరటిపల్లి స్టేజీ వద్ద నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలకు సంబంధించి అన్ని హక్కులు తమ గ్రామస్తులకే చెందుతాయని అరటిపల్లి గ్రామస్తులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో జాతర ఉత్సవాలకు సంబంధించి కమిటీ కూడా ఏర్పాటు చేశామన్నారు. అవగాహన రహితంగా కన్నెపెల్లి గ్రామస్తులు కమిటీలు వేసి జాతర నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. దానిని వ్యతిరేకిస్తూ గ్రామస్తులంతా సమావేశంలో చర్చించి ప్రకటన జారీ చేసినట్లు అరటిపల్లి గ్రామస్తులు పేర్కొన్నారు.

సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు జాతీయస్థాయి యోగా పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించగా మంగళవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ పీడీ తిరుపతితో కలిసి విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న బెల్లంపల్లిలో ఇండియన్ యోగా చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జూనియర్ విభాగంలో సాయి ప్రణీత, దీపిక ప్రథమ స్థానంలో, హారిక ద్వితీయ స్థానంలో, సీనియర్ విభాగంలో వర్షిణి, అంజలి, విద్య, ప్రతిభా, బిశ్వాస్‌లు ప్రథమ బహుమతి పొందినట్లు తెలిపారు. దానితో పాటు సోషల్ టాలెంట్ టెస్ట్‌లో 10వ తరగతి విద్యార్థి జశ్వంత్ జిల్లా స్థాయిలో ప్రథమ, మనస్విని తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, సంపత్, శోభ పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ..

జిల్లా కేంద్రంలో మహిళ డిగ్రీ గురుకుల కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు బెల్లంపల్లిలో నిర్వహించిన యోగా పోటీల్లో బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ శారద తెలిపారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల అందజేత

నార్నూర్: మండల కేంద్రంలోని చిత్తగూడ ఎంపీపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం చిరివేల్ల రవికుమార్ మంగళవారం ఐడీ కార్డులు అందజేశారు. పాఠశాల చైర్మన్ వాఘ్మారే బాబు, అంగన్‌వాడీ టీచర్ గిరిజబాయి గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

బెజ్జూర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం దహనం చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిపై సుమన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాల్క సుమన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూస శంకర్, మండల నాయకులు బాబాజీ, హకీమ్, రాజారామ్, శైలేష్, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

జైనూర్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామని డీసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కుడ్మేత విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు శేక్ ఇస్లాముద్దీన్, సోయం మోతిరాం, మండాడి లింగు, పంద్ర శేకు, పెందూర్ ప్రకాశ్, నాగోరావు, నాయకులు తదితరులు ఉన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

విద్యతోనే బంగారు భవిష్యత్తు

ఉట్నూర్‌రూరల్: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని గురుకులాల ప్రత్యేక అధికారి ఏకాంబరం అన్నారు. మంగళవారం స్థానిక కేబీ ప్రాంగణంలోని గురుకుల బాలికల జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, వసతి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అధ్యాపకులు పిల్లలకు అర్థమయ్యేరీతిలో విద్య బోధించాలన్నారు. ప్రిన్సిపాల్ సుమలత, అధ్యాపకులు పుణ్యావంతి, అశోక్, సిబ్బంది ఉన్నారు.

సైన్స్‌పై అవగాహన

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్పించి ప్రయోగాత్మకంగా వివరించారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు లక్ష్యం ఏర్పర్చుకొని చదువులో ముందుకు సాగాలని ఇంపాక్ట్ ఫౌండేషన్ ట్రైనర్ అర్జున్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లోని ఇంటర్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలకు సన్నద్ధత, జ్ఞాపకశక్తి పెంపొందించే పద్ధతులు, భవిష్యత్తులో విజయం సాధించేందుకు సోపానాలను వివరించారు. భయపడకుండా ధైర్యంగా విద్యార్థులు పరీక్షలు రాయాలని సూచించారు. లక్ష్యంతో ముందుకెళ్తే తప్పకుండా విజయం వరిస్తుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని పేర్కొన్నారు. అప్పుడే ఉన్నత గమ్యాలు చేరుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్: ఐఎన్‌టీయూసీ-327 సంఘానికి చెందిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావుతో కలిసి సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనిల్‌గౌడ్, గుండ శ్యాం, మునీర్ అహ్మద్, సంఘం సర్కిల్ కార్యదర్శి ఎమ్మాజి, డివిజన్ కార్యదర్శి ఆత్రం నసుమన్, శ్రీదేవి, అమరజ శ్రీనివాస్, జంజిరాల శ్రీనివాస్, సురేశ్, ప్రేమ్‌సాగర్, రామకృష్ణ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విశ్వప్రసాద రావు

ప్రారంభానికి ముందే పగుళ్లు

- నాసిరకంగా కమ్యూనిటీ షెడ్ల నిర్మాణం
- అధ్వానంగా ఫ్లోరింగ్
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు



భీంపూర్ కమ్యూనిటీ షెడ్డులో పగుళ్లు

తిర్యాణి: పల్లెల్లో గ్రామస్తులంతా కూర్చొని సభలు, సమావేశాలు, ఇతర చిన్నపాటి కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం కమ్యూనిటీ షెడ్ల నిర్మాణం చేపడుతోంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా షెడ్ల నిర్మాణాల్లో సదరు కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి.

కానరాని నాణ్యత..

మండలంలోని 29 గ్రామపంచాయతీలకు డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్టు) నిధుల ద్వారా రూ.3 లక్షల నుంచి రూ. 4లక్షల అంచనా వ్యయంతో 184 కమ్యూనిటీ షెడ్లు మంజూరు కాగా వీటిని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు 27 షెడ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరో 26 నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. అయితే పనులను కాంట్రాక్టర్‌లు తుతూ మంత్రంగా చేపడుతుండటంతో ప్రారంభం కాకముందే చాలా చోట్ల ఫ్లోరింగ్‌లు పగుళ్లు తేలుతున్నాయి. మరికొన్ని చోట్ల గచ్చు తేలిపోయి అధ్వానంగా మారాయి. నాణ్యమైన ఇసుకను వాడకుండా ఆయా గ్రామాల్లో పక్కనే ఉండే ఒర్రెల్లో లభించే ఇసుక నిర్మాణాలను చేపట్టారు. దీంతో పాటు నాసిరకమైన పైకప్పు, ఇనుప పోల్స్ వినియోగించారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు నాసికరంగా పనులను చేపట్టిన కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మళ్లీ ఫ్లోరింగ్ వేయాలి



మా గ్రామంలో నిర్మించిన కమ్యూనిటీ షెడ్డులో ఫ్లోరింగ్ అధ్వానంగా వేశారు. ఫ్లోరింగ్ చేసిన నాలుగు రోజులకే పగుళ్లు తేలింది. నాణ్యమైన ఇసుక వాడకుండా సమీప ఒర్రె నుంచి ఇసుక తీసుకొచ్చి వినియోగించారు. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవడంతోపాటు మళ్లీ ఫ్లోరింగ్ వేయాలి.

– మారుతి, కొలంగూడ (మాణిక్యపూర్)

చర్యలు చేపడుతున్నాం..

కమ్యూనిటీ షెడ్లలో చేపట్టిన ఫ్లోరింగ్ పగుళ్లు తేలినట్లు మా దృష్టికి వచ్చింది. నాసిరకమైన పనులు చేసిన చోట తిరిగి మళ్లీ నిర్మాణాలు చేపట్టాలని సదరు కాంట్రాక్టర్‌లను ఆదేశించాం.

– సుహాస్, పీఆర్ ఏఈ

ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి



రెబ్బెన: సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశ వర్కర్లు



కౌటాలలో..

రెబ్బెన: 45వ ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈనెల 16వ తేదీన ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మె నోటీసును మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనంగా నెలకు రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లు రమ, సుకన్య, అనిత, స్వప్న, సుజాత, సునీత, లలిత తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

కౌటాల: దేశవ్యాప్త కార్మిక సమ్మె నోటీస్‌ను మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లు వైద్య సిబ్బందికి అందించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 16న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దేశ వ్యాప్తంగా సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను చేపడుతున్నట్లు తెలిపారు.

కేంద్ర మంత్రులను కలిసిన 'పాల్వాయి'

కాగజ్‌నగర్‌రూరల్: ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కలిసి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక ఆయుష్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఆయుష్ వైద్యులను నియమించాలని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, ఆయుష్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌కు విన్నవించారు. నియోజకవర్గంలోని ప్రతీ మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుతో పాటు కాగజ్‌నగర్ పట్టణంలో స్టేడియం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కేంద్ర యువజన, క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్‌ను కోరారు. సిర్పూర్ నియోజకవర్గంలోని బెంగాలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కేంద్ర నౌకాయాన, ఓడరేవుల శాఖ సహాయ మంత్రివర్యులు శంతను ఠాకూర్‌ను కలిసి వివరించారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి రైల్వేశాఖకు సంబంధించిన పలు ప్రతిపాదనలను సమర్పించారు.



అశ్విని వైష్ణవ్, శంతను ఠాకూర్‌లకు వినతిపత్రం అందజేస్తున్న హరీశ్‌బాబు

విరగబూసిన 'మామిడి'



ఈ ఏడాది మామిడి పూత ఆశాజనకంగా ఉంది. వాంకిడి మండలంలోని వెల్గీ గ్రామ పంచాయతీ పరిధి కోపగూడ గ్రామ సమీపంలోని ఓ పత్తి చేనులో మామిడి చెట్టుకు పూత విరగబూసింది. చెట్టు కొమ్మలు, ఆకులు సైతం కానరానంతగా పూత పూయడంతో అటుగా వెళ్లే వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. – వాంకిడి